# అయ్యగారి మొగ్గులో!
# అమ్మగారి సిగ్గులో!!

సంస్కృతంలో మధురభక్తికి, శృంగారానురక్తికి గీత గోవిందం భగవద్గీత. మరి తెలుగులో ఆలాటిది, క్షేత్రయ్య మువ్వగోపాల పదాలే! ప్రేమ భక్తి ముక్తిరమ్యత! గోపికా కృష్ణుల వియోగజలధిలో మునిచి తీసిన రసవద్గీతలు క్షేత్రయ్య పదాలు-కృష్ణ విరహం కన్నా రాధావిరహమే మధురంగా వుంటుదనేది గీత గోవిందం ఢంకా బజాయించి చెబుతుంది దాన్ని తెలుగు నోటితో చాటేవి, క్షేత్రయ్య పదాలు.

అమరుకంలాటి, గాలిబ్ గీతాల్లాటి, ఉమర్ ఖయ్యాం రుబాయిల్లాటి ముక్తకాలు క్షేత్రయ్యపదాలు ధేనికవే ఒక శృంగార గాఢమయ గాధలు-దేనికది పాడి పరవశించతగ్గది. దేనికదే ఒక శృంగార సర్వస్వం. ఒక శృంగారం రస పీఠం.

క్షేత్రయ్య పదాల్లో తలమానికంవంటి పదం చూడండి.

మగువ తనకేళికా మందిరము వెడలెన్
వగకాడ మాకంచివరద తెల్లవారెననుచు
పిడజారు గొజ్జంగి విరిదండ జడతోను
కడు చిక్కుపడి పెనగు కంట సరితోను
నిడుద కన్నుల దేరు నిదుర మబ్బుతోను

తొందరి పదయుగమున దడబడెదు నడతోను
సొగసి సొగయని వలపు సొలపు జూపుతోను
వగవగల ఘనసార వాసనలతోను
జిగమించు కెమ్మోవి చిగురు కెంపులతోను
సగము కూచముల విదియ చందురుల తోను
తరితీపు సీయు సమసురతి బడలికతోను
యిరుగడల కైదండలిచ్చు తరుణులతోను
పరమాత్మ మువ్వగోపాల తెల్లవారెనునుచు
మగువ తనకేళికా మందిరము వెడలెన్.

పదసాహిత్యంలో యింతకంటే మంచిపదం వెదికినా మనకు కనిపించదేమొ! పద పదంలో అనుభవ శృంగారాన్ని భావభవజనక పోషకంగా భవ వినాశకంగా పలికించి చివరికి మువ్వ గోపాలుని ముద్దు పేరుతో ముక్తాయింపైన యింపైన పదం కదూ!

కంచి వరదరాజస్వామి వారి కేళీమందిరంనుంచి మీనాక్షి అమ్మవారు తెలతెలవారే వేళలో శృంగారాంచిత చిహ్నలతో సుప్రభాత సేవకంటే ముందుగా చెలులతో కలిసి చెలువం మీరేలా వచ్చే సొగసులన్నీ కళ్ళారా చూసిన కవిక్షేత్రజ్ఞ కల్పనా నల్పశిల్పశిఖరం ఇది!

తొలిజాము గడిచాక మలిజాము వేళలో పవళింపు సేవఅయ్యాక చెలులు దించివెళితే స్వామివారే తలుపుతీసి తలపుల సామ్రాజ్యంలోకి వలపుల దేవేరిని ఆహ్వానించారు.

ఆ మీదట అయ్యవారికీ అమ్మవారికీ ఏకాంతంలో ఏకశయ్యా భోగం అమరించి మలిజాము, నడిజాము అయింది. సుప్రభాత సేవకు భక్తగణం వచ్చి అమ్మనూ అయ్యనూ చూస్తే అమ్మగారికెంత సిగ్గు! అందుకే చెలుల ఎచ్చరికతో తెల్లారిపోతుందని చెప్పి బయటికి వచ్చింది మగువ.

ఆమె ఎలావుంది?

రాత్రి చెలులు సింగారించిన విరజాజిదండ జడనుండి విడజారి వేలాడ్తూ వాడి పోయివుంది నిట్టూర్పుల వగల సెగలలో వాడి పోయిందట అది! కంటసరి సరయిన వేడుకవల్ల చిక్కుబడి పోయిందట రేయల్లా నిద్దరమాలి పొద్దు గడిపినందువల్ల నిద్దురమబ్బునిదుర కన్నుల మీదేవుందట! చెలికత్తెల ఎదుటయినా సరే అయ్యవారి మందిరం నుంచి అమ్మగారు రావాలంటే సిగ్గేకదా! అందుకే అడుగులు తడబడ్తున్నాయట. ఇక ఆమె వాలుచూపులు ఎలావున్నాయి వలపు సొగసీ సొగయడంతో వలపు సొంపులు చూపుతున్నాయట! రేయి మేల్కొని జాము జాముకూ మధ్య మధ్య సేవించిన కస్తూరి నోరుపిప్పి విప్పక నవ్వే నవ్వుల్లోనే వగవగలు చిమ్ముతోందట. కెమ్మోవి తాంబూల రాగంతో జిగి మించింది. ఆ మెరుపులో దంతక్షతాలవల్ల పెదాలు ఒవురు కెంపుల్లా శోభిస్తున్నాయట. నఖక్షతాలు అరచంద మామలా వున్నాయి—అవి కంచుకం సరిగా లేక, జారడంవల్ల కనిపిస్తున్నాయి. వళ్ళంతా తరితేపులతో అలసిపోయింది వరదరాజస్వామి వారితో నలివిన సమశృంగారంలో ఆమెగారు వదలి బడలిక చెందితే యిరుగడలా చెలులుకై దండలిచ్చి తడబడే అడుగులను బడల్ని సోలనున్న స్థితిలో నడిపిస్తున్నారట-తెల్లవారెనని పరమాత్మున్ని ఎచ్చరించి ఆమె బయటికి వచ్చేశాక, బహుశా అయ్యవారు మేలుకొలుపు అయ్యేదాకా సొలసి నిద్రిస్తారేమో!

ఇంతి చక్కగా బొమ్మకట్టేలా పద రచన చేశాడు. క్షేత్రయ్య ప్రతి దానికి యింతెంత కధ రరవత్తరంగా పలుకుతుంది —

ఆయన పలుకుబళ్ళు కూడా అద్భుతంగా వుంటాయి. అనుకూలుడైనట్టి మగవాడు కలిగితే అంతకన్నను సంభ్రమమున్నదా అంటాడు ఓచోట! ఇన్నాళ్ళ వలె కాదమ్మా మువ్వ గోపాలుడెన్ని నేర్చినాడమ్మా అని ఆశ్చర్యపోయినా, ఎంత చక్కనివాడే నాసామి అని కితాబిచ్చినా? ఒక్కసారికే యిలాగైతే ఓహోహో యిదియేటి అని ఎగతాళి చేసినా. కలికిరో యింకొకసారి అని ఆశపడినా, వలచేది

యొకరి కోసమా అని నిర్వేదించినా, ముచ్చట దీరదు మువ్వ గోపాలా అని వేడినా, రమ్మనవే! సముఖాన రాయభారము లేలే అని నిల దీసినా, రామ! రామ! ఈ మేనితో నిక వాని మోము చూడవలెనా, మొదటి పొందే చాలు అని నిరసించినా సరసిజాక్షి జన్మము సఫలమాయెను అని రసించినా సామాన్యము గాదే వాని పొందూ అని తృప్తించినా చినదాని మనసు లోతులు కచ్చిగా నిక్కచ్చిగా చెప్ప కల్గటం క్షేత్రయ్యకే చెల్లింది.

గంపెడు మధుర పదా(ర్థా)ల్లో ఒకే ఒక పదా(ర్థ)మే ఇంత తీపి అయితే అన్నీ ఆస్వాదిస్తే!

జనులకు విమల విందు....అయితే ఆయనే అన్నట్టు పాయపు హొంత కారి కావలె వాని పద పద్య రచన సేయవలె, వాని ముద్దు కవిత చదువ నేరవలె, అవగలయందు గాయకురాలు కావలె!

—o—